క్లుప్తంగా

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

కుత్బుల్లాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి కోరారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24 పోలింగ్ బూత్‌లలో ఈనెల 2, 3వ తేదీల్లో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు పైబడిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా గతంలో ఓటు హక్కు పొందినా అడ్రస్ మార్పు, పేర్లలో తప్పుల ఉన్నా వాటిని సరిచేసుకోవచ్చని, కొంపల్లి జడ్పీహెచ్ఎస్, కొంపల్లి ఎంపీపీఎస్, దూలపల్లి జడ్పీహెచ్ఎస్, దూలపల్లి ఎంపీపీఎస్, ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్, పీయర్సన్ స్కూల్ లలో స్పెషల్ క్యాంప్‌లు ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

డబ్బులు చెల్లించలేదని ఇళ్ల కూల్చివేత



నిజాంపేట్: జీఓ. 59 కింద దరఖాస్తు చేసుకుని, నోటీసులు వచ్చినా డబ్బులు చెల్లించలేదని రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో రెవెన్యూ అధికారులు పలు నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు. లేని పక్షంలో కూల్చివేయాల్సి వస్తుందని తహసీల్దార్ పూల్‌సింగ్ తెలిపారు. ఈ కూల్చివేతల్లో డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దుండిగల్: అటవి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అనూప్(26) నగరానికి వలస వచ్చి దుండిగల్ ప్రాంతంలో ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అనూప్ డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించడం మొదలు పెట్టాడు. సొంత రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తు సొమ్ము చేసుకుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం బౌరంపేట స్నేక్‌పార్క్ సమీపంలోని అటవి ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు యత్నించాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ డివిజన్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనుప్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 2.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ బాలుడిని గుర్తిస్తే చెప్పండి



పోలీసుల చెంత ఉన్న బాలుడు

జీడిమెట్ల: మతిస్థిమితం సరిగా లేని ఓ బాలుడు జీడిమెట్ల పోలీసుల చెంతకు చేరాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం చింతల్ హెచ్ఎంటీ కాలనీలో ఓ మతిస్థిమితం లేని బాలుడు తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడు చేరుకున్న పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు అడిగారు. తన పేరు తేజ(15) అని తండ్రి పేరు రాములు, తల్లి పేరు జ్యోతి అని చెప్పాడు. ఇంటి అడ్రస్ మాత్రం చెప్పలేదు. పైఫొటోలోని బాలుడిని ఎవరైనా గుర్తిస్తే జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కత్తితో బెదిరిస్తున్న యువకుడి అరెస్టు



జీడిమెట్ల: కత్తితో స్థానికులను భయపెడుతున్న ఓ యువకుడిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సీఐ యం.పవన్ వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన శంఖర్ కుమారుడు దేవమ్మ శ్రీకాంత్(20) ఆటో డ్రైవర్. శుక్రవారం ఉదయం శ్రీకాంత్ మార్కాండేయ నగర్‌లో పొడవాటి కత్తి తీసుకుని తనకు డబ్బులు ఇవ్వాలని బెదిరించడం మొదలు పెట్టాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల పెట్రోలింగ్ మర్కాండేయనగర్‌కు వెళ్లి శ్రీకాంత్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా తన వద్ద ఉన్న బ్లేడుతో కోసుకుంటానని పోలీసులను బెదిరించాడు. పోలీసులు చాకచక్యంగా శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రత్యర్థులెవరు..



బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారుతో.. నియోజకవర్గాల్లో ప్రచార హోరు

- ఇమడలేక.. వెళ్లలేని సంకట స్థితిలో మైనంపల్లి, బేతి సుభాష్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీలలో టికెట్ కోసం పలువురి నేతల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం కసరత్తు.. ఆశావహుల్లో ఉత్కంఠ
- ఎన్నికల వేళ.. మేడ్చల్ జిల్లాలో రాజకీయ 'సందడి'

సాక్షి, మేడ్చల్ జిల్లా: బరిలో నిలిచేదెవరు? గులాబీ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేదెవరు? అనే చర్చ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఊపందుకుంది. అనూహ్యంగా అధికార బీఆర్ఎస్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో నిలిపే వారి పేర్లను ఖరారు చేయటంతో అభివృద్ధి కార్యక్రమాలతో పేరుతో ప్రచార హోరుతో ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. ఉప్పల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని కొత్త వారికి ఇవ్వగా.. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చినప్పటికీ, తనయుడికి మెదక్ టికెట్ కేటాయించలేదని అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఇద్దరు సిట్టింగ్‌లు బీఆర్ఎస్‌లో ఇమడలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిలో సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క అధికార పక్షం అభ్యర్థులకు దీటుగా.. విపక్షాలు ఎవరిని రంగంలోకి దింపుతాయనే ఉత్కంఠ అందరిలో ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలేంటి అన్న చర్చ కూడా జోరుగా సాగుతుండగా.. ఆ పార్టీలకు చెందిన ఆశావహులు మాత్రం పలు రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో టికెట్ తమకే లభిస్తుందనే ధీమాతో వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, అధిష్టానం వడపోత కార్యక్రమాన్ని మొదలు పెట్టింది.

మల్కాజిగిరి

నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అధిష్టానం ప్రకటించినా.. తనయుడు రోహిత్‌కు మెదక్ టికెట్ కేటాయించలేదన్న అసంతృప్తితో మంత్రి హరీష్‌రావుపై నిప్పులు చెరిగారు. ఈ విషయంలో మైనంపల్లి తీరుపై సీఎం కేసీఆర్ సహా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రుగా ఉండగా, అధిష్టానం కూడా ఆయనపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు బీఆర్ఎస్‌లో చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌లో ఉండలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిని మైనంపల్లి ఎదుర్కొంటుండగా, అధిష్టానం కూడా మైనంపల్లిపై చర్యలకు సిద్ధపడకుండా మెత్తపడినట్లు ప్రచారం. ఒకవేళ అధిష్టానం మైనంపల్లి హన్మంతరావుపై సీరియస్‌గా వ్యవహరిస్తే.. మల్కాజిగిరి నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి లేదా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బరిలో దింపవచ్చనే చర్చ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు నాయకులు దరఖాస్తు చేసుకున్నా పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కే దక్కుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మరో ఇద్దరు అన్నె వెంకట సత్యనారాయణ, బోనగిరి సురేష్‌యాదవ్ ఉన్నారు. మల్కాజిగిరిలో బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, కొత్తగా పార్టీలో చేరిన ఆకుల రాజేందర్, యువమోర్చా నాయకుడు భానుప్రకాష్ పోటీ పడుతున్నారు.

కూకట్‌పల్లి

బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి కూకట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ నుంచి కూకట్‌పల్లి టికెట్ కోసం 16 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, గాలివీర రామచంద్రబాలాజీ, పటోళ్ల నాగిరెడ్డి, వెలగపూడి వీవీస్ చౌదరి, మన్నె సతీష్‌కుమార్, ఆశపల్లి విజయచంద్ర, జాఫర్ అలీ, కొండకింది పుష్పారెడ్డి, దండుగుల యాదగిరి, మెడికొండ వెంకటమురళీ కృష్ణ, భక్త వత్సలం, జూలూరి ధనలక్ష్మీగౌడ్, పోట్లూరి శ్రీనివాస్‌రావు, దెరాటి మధుసాగర్, గొట్టిముక్కల పద్మరావు ఉన్నారు. కూకట్‌పల్లిలో బీజేపీ నుంచి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు, కొత్తగా పార్టీలో చేరిన ప్రేమ్ కుమార్ పోటీ పడుతున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

మేడ్చల్

సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డికి మళ్లీ మేడ్చల్ టికెట్ దక్కడంతో బలమైన పోటీదారుడుగా ప్రచార పర్వంలో ముందువరుసలో ఉన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ అనే నినాదంతో పీసీసీ ఉపాధ్యాక్షుడు తోటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం వీరితోపాటు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, పిసరి మహిపాల్‌రెడ్డి, పి.బాలేష్, గువ్వ రవి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే తొటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే హరివర్ధన్‌రెడ్డికి దక్కవచ్చనే ప్రచారం ఆ పార్టీలో సాగుతోంది. బీజేపీ నుంచి పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

ఉప్పల్

- ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని, బండారి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్‌కు అధిష్టానం టికెట్ కేటాయించడంతో కార్యకర్తల సమావేశాల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తానేని తప్పు చేశానో చెప్పకుండా..టికెట్ నిరాకరించడంపై ఆయన గుర్రుగా ఉన్నారు. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి పది రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్న తీరుపై పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాత్రం ప్రజల మద్దతు పొందేందుకు అనుచరులతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఉప్పల్ టికెట్ కోసం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, అమరిశెట్టి నరేందర్ ఉన్నారు. టికెట్ విషయంలో ముగ్గురి మధ్యే పోటీ ఉండగలదని పార్టీలో ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్ఎస్ఎస్ ప్రభాకర్‌తో పాటు మరో నాయకుడు పద్మారెడ్డి పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ వైపు మొగ్గు చూపవచ్చనే ప్రచారం పార్టీలో సాగుతోంది.

కుత్బుల్లాపూర్

సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్‌కు బీఆర్ఎస్ మళ్లీ టికెట్ కేటాయించడంతో.. అభివృద్ధి పనుల పేరుతో ప్రజల వద్దకు వెళ్తుండగా, కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 12 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ హన్మంతరెడ్డి, కందాడి జ్యోత్సదేవి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఉసిరిక అప్పిరెడ్డి, మహ్మద్ నిజాముద్దీన్, గుంజ శ్రీనివాస్, బండి సత్యంగౌడ్, దూళిపాక సాంబశివరావు, పోలీసు సుమిత్రారెడ్డి, అహ్మద్ నిజామొద్దీన్, బోనగిరి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడ బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

నేడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ



పెయింటింగ్ వేస్తూ..



డబుల్ ఇళ్ల పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: నగరంలో ఇళ్లు లేని వారికోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం పంపిణీ చేయనున్నారు. అందుకు అధికారులు వారం రోజుల నుంచి వాటిని సుందరీకరణ చేసి సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గంలో మొత్తం 14వేల ఇళ్లను నిర్మిస్తే 70వేల దరఖాస్తులు వచ్చాయి. అందులో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి కలిపి మొదటి విడతగా డీపోచంపల్లిలో 1200, బహదూర్‌పల్లిలో 356, గాజులరామారం దేవేందర్‌నగర్‌లో 144, మొత్తం 1700 ఇళ్లను పంపిణీ చేయనున్నారు. ఈ పంపిణీ బహదూర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయం వేదిక కానుంది. ముఖ్యఅతిథిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరుకానున్నారు. అధికారులతో కలిసి మంత్రి ఉదయం 10.30 గంటలకు లబ్ధిదారులకు పంపిణీచేయనున్నారు.

ఎవరికి వస్తుందో ఏమో..?

కుత్బుల్లాపూర్‌లో మొత్తం 70వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. కాని ఇక్కడి వారికి కేవలం 500మందికి మాత్రమే పంపిణీ చేయనున్నారు. ఇటీవల కలెక్టరేట్ కార్యాలయంలో డ్రా తీసిన విషయం తెలిసిందే. ఆ లిస్టులో తమ పేరు ఉంటుందేమోనని గంపెడు ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

కుక్కలను పట్టించుకోని సంరక్షణ కేంద్రం నిర్వాహకులు

- కేంద్రంలోనే మృతి చెందిన ఆరు కుక్కలు
- పోలీసులు, వెటర్నరీ అధికారులకు ఫిర్యాదు







కుక్కల సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తున్న వెటర్నరీ అధికారి, బలహీనంగా ఉన్న కుక్కను ఆస్పత్రికి తరలిస్తూ..


సుభాష్‌నగర్: యజమానులు అప్పగించిన కుక్కల కేంద్రంలో నిర్వాహకులు వాటి నిర్వహణ సరిగా చూసుకోకపోవడంతో ఆరు కుక్కలు చనిపోయాయని ఆరోపిస్తూ ఓ జంతు ప్రేమికురాలు వెటర్నరీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శుక్రవారం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డా. సుగునందన్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ రెడ్డితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

- వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ లాల్ సాహెబ్ గూడలో భాస్కరరాజు అనే వ్యక్తి పిట్లక్ అసోసియేషన్ ఫర్ యానిమల్స్ హబ్ రిహాబిలేషన్ అనే పేరుతో కుక్కల కేంద్రాన్ని నడుపుతున్నాడు. నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పెంపుడు కుక్కల బాగోగులు సరిగా చూసుకోవాలని నిర్వాహకులకు కొంత మొత్తంలో ఫీజు చెల్లించి వాటిని అప్పగిస్తారు.
- ఈ క్రమంలో విజయవాడకు చెందిన జంతు ప్రేమికులు రాధా, వరుణ్, రోజా, ఝాన్సీ, రుద్ర, మమత, కార్తీక్‌లు ఏప్రిల్, మే నెలలో 12 కుక్కలు అప్పగించినట్లు పేర్కొన్నారు. వీటి నిర్వహణ కోసం రూ.1.2లక్షలు చెల్లించామన్నారు. వీటిని చూడటానికి రెండు నెలల క్రితం రాధా ఇతరులు ఇక్కడికి రాగా అందులో ఆరు చనిపోయాయని నిర్వాహకులు తెలిపారు. దీంతో మిగతా వాటిని అప్పగించమంటే కేవలం రెండే అప్పగించారని తెలిపారు. అప్పటికే అవి తిండి లేక బలహీనంగా మారాయని తెలిపారు. ఈ విషయమై కూకట్‌పల్లిలో ఉండే జంతు ప్రేమికురాలు, స్ప్రెడ్ డాగ్ యానిమల్స్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు ఏ సువర్ణ లక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు.

మృతికి నిర్వాహకులు కారణమైతే చర్యలు తీసుకుంటాం..

కుక్కలు చనిపోయిన విషయమై సువర్ణ లక్ష్మి ఆగస్టు 1న సూరారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో వెటర్నరీ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం వారు కుక్కల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కుక్కల మృతిపై ముందస్తుగా అతడికి నోటీసులు పంపిస్తున్నామని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. కుక్కల మృతికి నిర్వాహకులు కారణమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల ఉన్నతికి నిరంతర కృషి



మాట్లాడుతున్న సురేశ్‌బాబు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి జె.శేషగిరిరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కళాశాలలో విద్య మీదనే కాకుండా క్రీడలు, పరిశోధనలు, అంకుర సంస్థ స్థాపన దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, విజే హబ్ పేరిట స్థాపించిన ఇంక్యూబేటర్ ద్వారా ఇప్పటికే 30 మంది అంకుర సంస్థలను నెలకొల్పామన్నారు. ర్యాగింగ్ ఇబ్బందులు లేకుండా విద్యార్థులు తమ మనస్తత్వానికి, వ్యక్తితత్వానికి అనుగుణంగా స్నేహితులను ఎంచుకుని జీవితంలో రాణించాలన్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం విద్యార్థులకు ఎప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. వారి ఉన్నతికి నిరంతరం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానాధ్యాపకుడు డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, అకడమిక్స్ డీన్ డాక్టర్ కె.అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బృందావన్ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బృందావన్ హిల్స్, ప్రశాంత్ హిల్స్, సైదప్పకాలనీ, రాజధాని స్కూల్, బండారి లేఅవుట్ రోడ్డు నెంబరు 10 ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

- బాచుపల్లిలోని ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు. 11కేవీ మల్లంపేట్, ఏసీ టైర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.
- ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిల్ప లేఅవుట్, కెనరా బ్యాంక్ ఏరియా, డాలర్ హోమ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు.
- చింతల్: భగత్‌సింగ్ ఫీడర్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గానగర్, స్ఫూర్తికాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..
- ఓల్డ్ చింతల్ ఫీడర్ పరిధిలోని చింతల్, చంద్రానగర్, శివనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా ఉండదని జగద్గిరిగుట్ట ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కుత్బుల్లాపూర్: కార్యకర్తల సంక్షేమానికి బీజేపీ పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 15వ డివిజన్‌కు చెందిన బీజేపీ కార్యకర్త కొమ్మి దినేష్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న శ్రీశైలంగౌడ్ శుక్రవారం ఆయన్ని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

స్థానికులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకే ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లను పంపిణీ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు.

- ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావుడిగా పంపిణీ చేపట్టిందని దుయ్యబట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లక్ష మంది దరఖాస్తు చేసుకుంటే 500 మందికే ఇళ్లను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలను కాదని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పక్క నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు ఇళ్లను కేటాయించేందుకు కుట్ర పన్నారని, స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లను కేటాయిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. బీసీ బంధు పేరిట లక్ష రూపాయలు సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కొత్త నాటకానికి తెర లేపిందని విమర్శించారు. దళిత బంధు పేరిట దళితులను మోసం చేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేకు దమ్ముంటే ఎంతమంది బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరిగే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బడుల్లో వసతుల కల్పనకు కేకేఎం ట్రస్ట్ కృషి



జగద్గిరిగుట్ట జడ్పీహెచ్ఎస్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కేకేఎం ట్రస్ట్ కృషి చేస్తోందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కేకేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1500 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ తరఫున ఇప్పటికే పలు పాఠశాలల్లో కిట్లను అందజేశామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని పాఠశాల్లో విద్యనభ్యసించే వారికి అందిస్తామన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.
- ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మేకల సురేష్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరకల సుధా, నాయకులు సిద్ధిరామిరెడ్డి, అరుణరెడ్డి, మహేందర్, నరేష్‌గౌడ్, నందికంటి శ్రవణ్, మాధవులు, పడాల సత్యనారాయణ, కేకేఎం ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న షాపూర్‌నగర్ బడీ మసీదు కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం ఆయన దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీపోచంపల్లి, సాయిపూజ కాలనీల్లో స్థానిక కౌన్సిలర్ సాయియాదవ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్‌యాదవ్, సీనియర్ నాయకులు రాజశేఖర్‌యాదవ్, కొత్తగూడెం శ్రీశైలం, జహంగీర్, లింగం గౌడ్, కిరణ్ స్వామి, మధు, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతు తెలిపిన మసీదు కమిటీ..

- షాపూర్‌నగర్‌కు చెందిన బడి మసీదు (జామ మసీదు మొహమ్మదీయ) కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో ఉన్న ఆయనకు మద్దుతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. షాదీముబారక్ పథకం కింద పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం, హజ్‌యాత్రకు సబ్సిడీ, పండుగలకు తోఫాలు అందజేస్తోందన్నారు.
- ప్రజల మద్దతుతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం కేసీఆర్‌కు బహుమతి ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, మైనారిటీ అధ్యక్షుడు ఎండీ మొయిజ్, నాయకులు మఖ్సూద్ అలీ, ఫిరోజ్, ప్రభుదాస్, మసీదు కమిటీ చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ నసీరుద్దీన్, ప్రెసిడెంట్ అల్హాజ్ షేక్ మహమ్మద్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అమీర్ ఖాన్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఒమేర్ తదితరులు పాల్గొన్నారు.



దీపోచంపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్